క్లుప్తంగా

సప్లమ్మ దేవతకు జ్యోతులు



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రజలు

లేపాక్షి: మండలంలోని కుర్లపల్లిలో కొలువైన గ్రామ దేవత సప్లమ్మ తల్లికి మంగళవారం జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు తమ ఇళ్ల వద్ద నుంచి జ్యోతిని మోసుకుని గ్రామ నడిబొడ్డు మీదుగా ఆలయానికి వచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి జ్యోతులను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జ్యోతుల సందర్భంగా బంధువులు, స్నేహితులను ఆహ్వానించడంతో ప్రతి ఇల్లూ కళకళలాడింది.

నేడు మండల సమావేశం

సోమందేపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

అన్నదాన సత్రానికి రూ.1.16 లక్షల విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న రమానందన్

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి ఆలయ సమీపంలో అన్నదాన సత్రం నిర్వహణకు మండలంలోని చోళసముద్రం గ్రామానికి చెందిన రమానందన్, కృష్ణప్రియ దంపతులు మంగళవారం రూ.1.16 లక్షల విరాళాన్ని ఆలయ కమిటీకి అందించారు. తన తల్లి దివంగత రమామణి, తండ్రి విజయరావు ఆశీస్సులతో విరాళం అందజేసినట్టు దాత రమానందన్ పేర్కొన్నారు. అనంతరం వీరభద్రస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అర్చకులు, కమిటీ సభ్యులు వారిని సన్మానించారు. వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, కమిటీ సభ్యులు రాంప్రసాద్, రవికుమార్, ఆనందరెడ్డి, లక్ష్మీనారాయణప్ప, శ్యాంప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

పెనుకొండ: విద్యార్థులు, ప్రజల్లో శాస్త్రీయ భావనలను పెంపొందించేందుకు చేపట్టనున్న కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జన విజ్ఞాన వేదిక నాయకులు పోస్టర్లు విడుదల చేశారు. జేవీవీ జిల్లా నాయకులు హరి మాట్లాడుతూ ప్రఖ్యాత శాస్త్రవేత్తలు సీవీ రామన్, మేడమ్ క్యూరీ జయంతి సందర్భంగా ప్రజల్లో మూఢ నమ్మకాలు తొలగించేందుకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయప్ప, అధ్యాపకులు ప్రతాప్, రంగనాయకులు, చెన్నారెడ్డి, యశోద, రామన్న తదితరులు పాల్గొన్నారు.

కరాటే క్రీడాకారులకు అభినందన



కరాటే క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

హిందూపురం: రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన హిందూపురం పట్టణానికి చెందిన హరీష్, లోకేష్, కార్తీక్, యాసిన్, తేజును మంగళవారం మాజీ కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగభూషణంరెడ్డి అభినందించారు. అనంతరం రూ.5వేలు బహుమతిగా అందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపి పట్టణానికి కీర్తి తేవాలని కోరారు.

పురాన్ని జిల్లా పరిపాలనా కేంద్రంగా ప్రకటించండి

హిందూపురం: హిందూపురాన్ని జిల్లా పరిపాలన కేంద్రంగా ప్రకటించాలని బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు కోరారు. మంగళవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైశాల్యం, వాణిజ్యపరంగా జాతీయస్థాయిలో గుర్తింపు పొంది అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్న హిందూపురాన్ని జిల్లా నిర్వహణ కేంద్రంగా ప్రకటించాలన్నారు. హిందూపురం, మడకశిర, పెనుకొండ,కదిరి ప్రాంతాలకు అనుకులంగా, ఉత్తర దిశగా ప్రభుత్వ భూములు పుష్కలంగా ఉండటం వల్ల అభివృద్ధికి అన్నివిధాలుగా సానుకూలత ఉంటుందన్నారు.నాయకులు నారాయణ, చిరంజీవి, నాగరాజు, మౌలాలీ, చంద్రశేఖర్, గంగాధర్, నరసింహులు పాల్గొన్నారు.

దారులన్నీ జన ప్రవాహం... హోరెత్తిన జై జగన్ నినాదం







ఎమ్మెల్యే తిప్పేస్వామితో కలిసి సభకు బయల్దేరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, హిందూపురం సమన్వయకర్త టీఎన్ దీపిక ఆధ్వర్యంలో తరలివెళ్తున్న నాయకులు, పెనుకొండ నుంచి బస్సులో సభకు పయనం

పెనుకొండ: సీఎం జగనన్న పర్యటనతో అన్నివర్గాల ప్రజల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. వ్యవసాయాన్ని పండుగ చేస్తూ తమకు అండగా నిలిచిన జగనన్నను కనులారా తిలకించాలని అన్నదాతలు వేలాదిగా జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు. దీంతో దారులన్నీ జనప్రవాహం అయ్యాయి. జీపులు, బస్సులు, బైక్‌లు ఇలా ఏది దొరికితే అందులో రెట్టించిన ఉత్సాహంతో తరలివెళ్లారు. రైతు భరోసా–పీఎం కిసాన్ నిధులను రైతుల ఖాతాల్లో వేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం జిల్లా కేంద్రం పుట్టపర్తికి విచ్చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాలనుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లారు. పెనుకొండ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీనాయకులు, రైతులు వేలాదిగా తరలివెళ్లారు. జగనన్న జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.

మడకశిర రూరల్: ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో మడకశిర నియోజకవర్గం నుంచి అన్ని మండలాల నుంచి బస్సులు, జీపులు, ఇతర వాహనాల్లో ప్రజా ప్రతినిధులు, నాయకులు తరలివెళ్లారు.

చిలమత్తూరు: హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు వేలాదిగా తరలివెళ్లారు. ఎంపీపీ పురుషోత్తమరెడ్డి పాల్గొన్నారు.

గోరంట్ల: పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆదేశాల మేరకు మండలం నుంచి బస్సుల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు రైతులు తరలివెళ్లారు. 20 గ్రామ పంచాయతీల పరిధిలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు.

అమరాపురం: ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, జేసీఎస్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, వైస్ ఎంపీపీలు, వేలాది మంది ప్రజలు తరలివెళ్లారు.

పెనుకొండ రూరల్: రాంపురం, శెట్టిపల్లి, అడదాకులపల్లి, గొల్లపల్లి, నాగలూరు, గోనిపేట, మావటూరు, గుట్టూరు, మునిమడుగు గ్రామాల నుంచి వేలాదిగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, రైతులు బస్సులు, ఇతర వాహనాల్లో భారీగా తరలివెళ్లారు.

వర్షం..అన్నదాతల హర్షం

ఎట్టకేలకు వరుణుడు కురిణించాడు. ఈశాన్య రుతుపవనాల్లో కదలిక రావడంతో హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో భారీ వర్షాలు కురిశాయి. సోమవారం రాత్రి ఏకధాటిగా కురిసిన వర్షాలకు వంకలు, వాగులు పొంగి ప్రవహించాయి. పొలాలు పదునయ్యాయి. సాగులో ఉన్న పంటలకు ఈ వర్షం ప్రాణం పోసిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



హిందూపురంలో జలమయమైన రహదారి

మడకశిరరూరల్: మడకశిర నియోజకవర్గంలో సోమవారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. మడకశిర మండలంలో 72 ఎంఎం, అమరాపురంలో 52 ఎంఎం, రొళ్లలో 38 ఎంఎం, అగళిలో 12 ఎంఎం, గుడిబండలో 10 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు మంగళవారం తెలిపారు. భూగర్భజలాలు పెంపు కోసం పాఠశాలల వద్ద ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతల్లో వర్షపు నీరు చేరి భూమిలోకి ఇంకిపోతున్నాయి. రబీలో పంటల సాగు చేయడానికి ఈ వర్షం ఉపయోగపడిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. భూమిలో తేమశాతం ఉండడంతో ఉపాధి పనులు సులభంగా చేయడానికి వీలుంటుందని కూలీలు తెలిపారు.

హిందూపురం అర్బన్: హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. హిందూపురంలో 51.2, లేపాక్షిలో 72.8, చిలమత్తూరులో 69.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

సోమందేపల్లి:
మండల వ్యాప్తంగా సగటున 90.2 మి.మీ.వర్షపాతం నమోదైనట్లు గణాంక అధికారులు తెలిపారు. చెక్‌డ్యాం, చెరువుల్లోకి నీరు చేరింది. చాకర్లపల్లిలో వర్షం నీరు కిరాణా దుకాణంలోకి చొరబడింది. రూ.10వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. పెనుగాలులతో ఎంపీడీఓ కార్యాలయం ప్రహరీగోడపై చెట్టు కూలింది. ఎవ్వరికీ అపాయం జరగలేదు.

అమరాపురం: మండలంలో 52.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వక్క తమలపాకు, ఉల్లి, మొక్కజొన్న, రాగి తదితర ఉద్యాన పంటలకు ఈ వర్షం ఉపకరించిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పెనుకొండ రూరల్: మండల వ్యాప్తంగా సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. 76.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

చిలమత్తూరు: మండలంలో ఉరుములు, మెరుపులతో ఎడతెరిపిలేని వర్షం కురిసింది.కుంటలు, చెరువులు, గుంతల్లోకి నీరు వచ్చి చేరింది. 69.4 మి.మీ వర్షపాతం నమోదైంది.



44 వ నెంబరు జాతీయ రహదారిలాలేపల్లి వద్ద గుంతలో చేరిన వర్షపు నీరు



గౌడనహళ్ల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలో నిల్వ ఉన్న వర్షపు నీరు



సోమందేపల్లి ఎంపీడీఓ కార్యాలయం గోడపై కూలిన చెట్టు

నీట మునిగిన వరిపంట



కలిపిలో నీట మునిగిన వరి పంటను చూపుతున్న రైతులు

రొద్దం: మండల పరిధిలోని కలిపి గ్రామ పంచాయతీ పరిధిలోని కలిపి, కె.మరువపల్లి, బూదిపల్లి, శేషాపురం గ్రామాల్లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. చెరువుల కింద నాలుగు గ్రామాల పరిధిలో సాగు చేసిన వరి పంటకు నష్టం వాటిల్లింది. 500 ఎకరాల్లో వరిపంట నీట మునిగినట్లు రైతులు చెబుతున్నారు. వారం రోజుల్లో పంట చేతికందాల్సి ఉండగా వర్షంతో పంట నేలకొరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ కదిరమ్మ, పెనుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ పంటను పరిశీలించామన్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి రైతులకు నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మంచినీటి బోరు ఏర్పాటు



బోరు వేస్తున్న దృశ్యం

మడకశిర రూరల్: మండలంలోని మెళవాయి పంచాయతీ సిద్దగిరి ఉన్నత పాఠశాల ఆవరణలో జేజేఎం పథకం ద్వారా మంగళవారం మంచినీటి బోరు తవ్వారు. నీరు సమృద్ధిగా పడిందని సర్పంచ్ రంగనాథ్ తెలిపారు. మోటార్ అమర్చి పైపు లైన్ ద్వారా కొళాయిలకు తాగునీటిని సరఫరా చేస్తామన్నారు.

నేడు సచివాలయాల ప్రారంభం

- హాజరు కానున్న ఎమ్మెల్యే శంకరనారాయణ





పరిగి: మండల కేంద్రం పరిగిలో బుధవారం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పర్యటిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీడీఓ సరస్వతి, సర్పంచ్ లక్ష్మీదేవి తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఉదయం 10 గంటలకు సచివాలయం 1, సచివాలయం 2 కార్యాలయాలతో పాటూ రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నాడు-నేడు పనుల పరిశీలన



పి.గొల్లహట్టిలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 శ్రీధర్

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని ఎంఈఓ–2 శ్రీధర్ పేర్కొన్నారు. రంగనపల్లి, పి.గొల్లహట్టి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం అమలు తీరును పర్యవేక్షించారు. పి.గొల్లహట్టిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో నాడు–నేడు కింద చేపట్టిన మరుగుదొడ్లు, ప్రహరీ, అదనపు గదుల నిర్మాణాలను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

లేపాక్షిని సందర్శించిన వ్యవసాయ శాఖ కమిషనర్



కమిషనర్ హరికిరణ్‌ను సత్కరిస్తున్న ఆలయ అర్చకులు

లేపాక్షి: రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ మంగళవారం లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఈయనకు ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు స్వాగతం పలికారు. ఆలయంలోని శిల్ప సంపదను చూసి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం వీరభద్రస్వామి, దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. హిందూపురం ఏడీఏ రవి, స్థానిక ఏఓ శ్రీలత, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, అన్నదాన కమిటి సభ్యులు ఆయన వెంట ఉన్నారు.

స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక సోలార్ పార్క్‌లో 80 శాతం ఉద్యోగాలు స్థానికులకే కల్పించి వలస లు నివారించాలని కర్ణాటక బహుజన సమాజ్ పార్టీ నేత టీ హనుమంతరాయ డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక తాలూకా కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా సుమారు 20 వేల మంది విద్యావంతులు, నిరుద్యోగులు బెంగళూరు తదితర నగరాలకు ఉపాధి కోసం వలస వెళ్లారన్నారు. ప్రపంచంలోనే అతి పెద్దదైన 2,500 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం ఉన్న సోలార్ పార్క్ తాలూకాలో ఏర్పాటైనా నిరుద్యోగులకు ఉపాధి లభించకపోవడం శోచనీయమన్నారు. సోలార్ పార్క్ యాజమాన్యం చొరవ చూపి నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వరదరాజుకు వినతి పత్రం అందించారు. ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి వెంకటరమణప్ప పాల్గొన్నారు.

'పురం' అభివృద్ధికి నిధులివ్వండి

- సీఎం జగన్‌ను కోరిన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్, దీపిక



టీఎన్.దీపిక

హిందూపురం: హిందూపురం నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక కోరారు. మంగళవారం పుట్టపర్తికి విచ్చేసిన జగన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఇప్పటికే రూ.60 కోట్ల అభివృద్ధి పనులకు నివేదికలు ఇచ్చినట్లు సీఎంకు ఆమె వివరించారు. అదేవిధంగా మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ శివ సీఎంను కలిసి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన సీఎం జగన్.. పక్కనే ఉన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మాట్లాడుతూ ఇదివరకు పురం అభివృద్ధికి రూ.25కోట్లు విడుదల చేసిన విషయాన్ని వాకాబు చేశారు. హిందూపురం అభివృద్ధికి మరిన్ని నిధులు విడుదల చేస్తామని సీఎం హామీ ఇచ్చారని దీపిక తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



స్వాతి



అమృత



తేజ

పరిగి: మండలంలోని ధనాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మహేష్‌దీపక్ తెలిపారు. అనంతపురంలో అండర్ 14. అండర్ 17 విభాగాలకు నిర్వహించిన వాలీబాల్ పోటీలలో స్వాతి, అమృత, తేజ చక్కటి ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. మంగళవారం సదరు విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పరిగి: ఇటీవల జిల్లా స్థాయిలో కొత్తచెరువులో జరిగిన 31వ బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్(ఎన్‌సీఎస్‌సీ)లో ధనాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎల్ మంజుల ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ప్రకృతి సైతం మెచ్చేలా ప్లాస్టిక్ వస్తువులను వినియోగించాలన్న అంశంపై ఆమె ప్రదర్శించిన నమూనా న్యాయ నిర్ణేతలను కట్టిపడేసి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ ఎం జ్యోతిర్మయి, గైడు టీచర్, ఫిజికల్ అసిస్టెంట్ రాధమ్మ తెలిపారు.



ఫ్రెండ్లీ నేచర్ ప్రొడక్ట్‌పై ప్రదర్శన ఇస్తున్న విద్యార్థిని మంజులతో ఉపాధ్యాయురాలు రాధమ్మ

చిన్నారులకు కంటి పరీక్షలు

పావగడ: స్థానిక శారదా దేవి కంటి ఆస్పత్రిలో స్వామి జపానంద నేతృత్వంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక చిన్న పిల్లల కంటి చికిత్స శిబిరానికి విశేష స్పందన లభించింది. 6 నెలల నుంచి 12 సంవత్సరాల వయసున్న 146 మంది పిల్లలకు బెంగళూరుకు చెందిన ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ వసుధ నరేశ్, ఆర్య కంటి పరీక్షలు చేశారు.

శాసనాలపై అధ్యయనానికి అవకాశం



పురస్కారాలు అందుకున్న ప్రముఖులు

పావగడ: చరిత్ర అధ్యయనం సరికొత్త పుంతలు తొక్కుతోందని హంపీ కన్నడ వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ డీవీ పరశివమూర్తి అభిప్రాయ పడ్డారు. స్థానిక ఎస్ఎస్‌కే సముదాయ భవనంలో మంగళవారం కర్ణాటక ఇతిహాస అకాడమి నిర్వహించిన 37వ రాష్ట్ర స్థాయి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక ఇతిహాస అకాడమి చిన్నపాటి కాగితాల రాతల నుంచి శాసనాల వరకు అధ్యయనానికి అవకాశం కల్పిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఇతిహాస దర్శనం కృతిని విడుదల చేశారు. అదే విధంగా ఇతిహాస సంస్కృతి శ్రీ పురస్కారాలను చరిత్ర పరిశోధకులకు అందించారు. మాజీ మంత్రి వెంకటరమణప్ప, ఎస్ఎస్‌కే సంఘం అధ్యక్షుడు ఆనందరావ్, అకాడమి పదాధికారులు పాల్గొన్నారు.

సాయం చేసి పుత్రభిక్ష పెట్టండి

- బీటెక్ విద్యార్థికి మెదడులో బ్లడ్ కాట్
- బెంగళూరులో చికిత్స
- ఆపరేషన్‌కు రూ. 60 లక్షలు
- ఆపన్న హస్తం కోసం తండ్రి ఎదురుచూపులు



బెంగళూరులో వైద్యచికిత్స పొందుతున్న రాజ మోహన్ కృష్ణ

హిందూపురం: ఉన్నత చదువులు చదువుతున్న యువకుడు అనుకోని రీతిలో రోడ్డు ప్రమాదానికి గురై క్షతగాత్రుడిగా మారాడు. తనయుడి వైద్యానికి తండ్రి తన సర్వస్వం వెచ్చించాడు. లక్షల రూపాయలు ఖర్చు చేశాడు. కుమారుడు కోలుకోవాలంటే మరింత డబ్బు అవసరం. చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితుల్లో దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. హిందూపురం మండలం కొటిపికి చెందిన గంగప్ప ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రామకృష్ణ కాగా రెండో కుమారుడు రాజ మోహన్‌కృష్ణ హిందూపురంలోని బిట్ ఇంజినీరింగ్ కాలేజీలో చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఈఏడాది జూలై 2న కళాశాల నుంచి ఇంటికి తిరిగి వస్తూ తమ గ్రామానికి చెందిన బైకిస్టును లిఫ్ట్ అడిగాడు. వాహనంలో వస్తుండగా బైక్ రాయిని ఢీకొంది. వెనుక కూర్చున్న రాజమోహన్ కృష్ణ తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల్లో మెదడు వద్ద బ్లడ్ క్లాట్ కావడంతో పాటు నరాలు దెబ్బతిన్నాయని తేలింది. ఆపరేషన్‌కు రూ.60 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. దీంతో ఇంటిని, ఇతర విలువైన ఆస్తులు విక్రయించి రూ.46 లక్షలు సమకూర్చారు. అయితే రూ.14 లక్షలు అందితే వైద్యం పూర్తిగా అందుతుంది. మరో వైపు కొడుకుపై దిగులు పెట్టుకున్న తల్లి మంచం పట్టి ఇటీవల మృతి చెందింది. ఓ వైపు భార్య మృతి చెందడం, ఆస్పత్రిలో కుమారుడు వైద్యం కోసం ఎదురు చూపులు, చేతిలో చిల్లిగవ్వలేక గంగప్ప దాతల కోసం ఎదురు చూస్తున్నాడు. మనసున్న మారాజులు ఆదుకొని తనకు పుత్రభిక్ష పెట్టాలని వేడుకుంటున్నాడు.

పేరు: రామకృష్ణ
బ్యాంక్: ఇండియన్ బ్యాంక్
ఖాతా నంబర్ 614031931
ఐఎఫ్‌సీ కోడ్ ఐడిబిఐ000హెచ్055

సీఎం సహాయ నిధికి దరఖాస్తు

కొడుకు ఆరోగ్య పరిస్థితి,పేదరికం తెలియజేస్తూ సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నామని, అది కూడా పరిశీలనలో ఉందని, అంతవరకు తన కొడుకు వైద్యానికి ఆర్థిక సహాయం చేయాలని గంగప్ప కోరుతున్నాడు. సహాయం అందించేవారు తన రెండో కుమారుడు రామకృష్ణ పేరున నగదు పంపాలని కోరుతున్నాడు.

ఓబీసీ జాబితాలోకి చేర్చండి

రొళ్ల: మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 54 శాతం పైగా కలిగిన కుంచిటి వక్కలిగ కులస్తులను ఓబీసీ జాబితాలోకి చేర్చాలని తాలూకా కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు, రొళ్ల జెడ్పీటీసీ బి.అనంతరాజు కోరారు. మంగళవారం పుట్టపర్తికి విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌ను ఎమ్మెల్యే తిప్పేస్వామి సమక్షంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తాలూకా కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ ప్రస్తుతం కుంచిటి వక్కలిగ కులస్తులు బీసీ–బీగా ఉన్నారని, అయితే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగావకాశాలు పొందాలంటే ఓబీసీ సర్టిఫికెట్ అవసరం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని న్యాయం చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర పాల్గొన్నారు.

మాదిగల విశ్వరూప మహాసభకు తరలిరండి

రొళ్ల: మాదిగల హక్కుల సాధన కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 11న హైదరాబాద్‌లో తల పెట్టిన మాదిగల విశ్వరూప మహాసభకు మాదిగ కులస్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని జాతీయ కార్యదర్శి రంగనపల్లి రాయుడు కోరారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలో కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు కోడిరంగప్ప, శివన్న, ఓబుళనరసింహప్ప పాల్గొన్నారు.